

శనివారం తేనీటి విందుకు ముందు సచివాలయం ఎదుట రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

# సచివాలయం అద్భుతం

- సీఎం కేసీఆర్ అభినందనీయుడు
- రిటైర్డ్ ఏఐఎస్ అధికారుల ప్రశంసలు
- సచివాలయంలో సీఎస్ తేనీటి విందు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సచివాలయం అద్భుత నిర్మాణమని రిటైర్డ్ అలిండియా సర్వీసెస్ (ఏఐఎస్) అధికారులు ప్రశంసించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం సాయంత్రం సచివాలయంలో వారికి తేనీటి విందు ఇచ్చారు. ఈ విందుకు రాష్ట్రంలో 1970 నుంచి ఇటీవలి వరకు వివిధ హోదాల్లో సేవలందించి రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ముందుగా సచివాలయం ఎదుట గ్రూప్ ఫొటో దిగిన అనంతరం కొత్తగా నిర్మించిన ఆలయం, మసీదు, చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా వారంతా సచివాలయ భవన సముదాయాన్ని అన్ని ఫ్లోర్లను పరిశీలించారు. దేశంలోనే ఆదర్శమైన పరిపాలనా సౌధమని వారు ఈ సందర్భంగా కొనియాడారు. సంక్షేమ, అభివృద్ధి రంగాల్లో రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో అప్రతిహాత అభివృద్ధిని సాధిస్తున్న సీఎం కేసీఆర్ అభినందనీయుడని కొనియాడారు. సచివాలయంలోని ప్రత్యేకతలను, తొమ్మిదేండ్ల ప్రగతిని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎస్ వివరించారు. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ కే అశోక్‌రెడ్డి నేతృత్వంలో



రిటైర్డ్ అధికారులకు సచివాలయం గురించి వివరిస్తున్న సీఎస్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వీడియో రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఏకే కుట్టి, సుజాతారావు, వీపీ జవహరి, పీసీ పారేఖ్, కేవీ రావు, రాజీవ్‌శర్మ, ఎస్కే జోషి, జై భరత్‌రెడ్డి, రస్తోగి, మిన్నీ మాథ్యూస్, ఏకే గోయల్, దినకర్ బాబు, జీ సుధీర్, టీఎస్ అప్పారావు, జీ నాగిరెడ్డి, రేమండ్ పీటర్ ఉన్నారు.

# ప్రతి ఎకరం తడిసేలా సాగునీరు

- కేసీఆర్, కేటీఆర్ కృషితో సాగునీరు
- రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
- గుండ్లసాగర్ శివారులో నీటి విడుదల



గుండ్లసాగర్ శివారులో పైపులైన్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

వేలేరు, సెప్టెంబర్ 30 : ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేయగా, గత ఫిబ్రవరిలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వేలేరు మండలంలోని సోడాషపల్లి గ్రామంలో పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అవి పూర్తి కావడంతో శనివారం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గుండ్లసాగర్ శివారులో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పైపులైన్ ద్వారా సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ తెలంగాణలోని మారుమూల గ్రామాల్లో సైతం ప్రతి ఎకరం తడిసేలా సాగునీరు అందించేందుకే సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతాలైన వేలేరు, ధర్మసాగర్, చిల్పూర్ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందించేందుకు నిధులు మంజూరు చేశారని చెప్పారు. గత ఫిబ్రవరిలో మంత్రి కేటీఆర్ సోడాషపల్లిలో లిఫ్ట్ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేయగా సుమారు 6 నెలల్లో పనులు పూర్తి చేసి పైపులైన్ ద్వారా సాగునీరు అందించడానికి అధికారులు, మండల ప్రజాప్రతినిధులు కృషి చేసినట్టు తెలిపారు. గుండ్లసాగర్ శివారులో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పైపులైన్ ద్వారా వేలేరు, లోక్యాతండా, మిరపకుంట తండా, ఎర్రబెల్లి గ్రామాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, నారాయణగిరి గ్రామాలకు సైతం సాగునీరు చేరుతుందని ఆయన పేర్కొన్నారు. లిఫ్ట్-2 ద్వారా నష్కల్, ధర్మారం, వంగాలపల్లి గ్రామాలకు సాగునీరు అందించేందుకు పనులు జరుగుతున్నాయని, చిల్పూరు మండలంలోని పలు గ్రామలకు సైతం సాగునీరు చేరుతుందని అన్నారు. త్వరలోనే ఆయా గ్రామాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుందని వివరించారు. లిఫ్ట్-3లో భాగంగా కన్నారం గ్రామ చెరువులోకి సాగునీరు అందించేందుకు పనులు ప్రారంభించినట్టు తెలిపారు. వచ్చే యాసంగి వరకు పైపులైన్ పనులు పూర్తి చేసి, కన్నారం, పీచర, వావిల్లకుంట గ్రామాలకు సైతం సాగునీరు అందిస్తామని చెప్పారు. గుండ్లసాగర్ శివారులోని పైపులైన్ వద్ద ఎమ్మెల్సీ పల్లా పూజలు చేసి నీటిని విడుదల చేయగా పలు గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు జరుపుకొన్నారు. సాగునీరు అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ పల్లాకు రైతులు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## నిరుపేద విద్యార్థికి రుద్ర రచన సాయం

కథలాపూర్, సెప్టెంబర్ 30 : చదువుకొనేందుకు తాను పడ్డ కష్టాలు మరెవరూ పడకూడదని తలంచింది జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన అనాథ యువతి రుద్ర రచన. మంత్రి కేటీఆర్ సహకారంతో బీటెక్ పూర్తి చేసిన ఆమె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడింది. తన గ్రామానికి చెందిన సాదుల రంజిత్ అనే పేద ఇంజినీరింగ్ విద్యార్థి చదువు కోసం రచన రూ.12 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేసింది. రుద్ర రచన ఇటీవలే సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.లక్ష విరాళాన్ని అందించిన విషయం తెలిసిందే.



ఆర్థికసాయం చేస్తున్న రుద్ర రచన



వరంగల్ జిల్లా నర్సంపేటలో దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి

## కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మొద్దు

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు

నర్సంపేట, సెప్టెంబర్ 30 : కాంగ్రెస్ నాయకుల మోసపు మాటలను ప్రజలు నమ్మొద్దని వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం నర్సంపేటలో 41 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను దివ్యాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిస్తున్న ఛత్తీస్‌గఢ్, కర్ణాటకలో ఇవ్వలేని పథకాలను తెలంగాణలో ఇస్తామని చెబుతున్నదని, వాటిని ప్రజలు విశ్వసించడం లేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అమలుకు సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మోసగిస్తున్నాయని మండిపడ్డారు. దివ్యాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 5.20 లక్షల మంది దివ్యాంగులకు పింఛన్లు అందిస్తున్నట్టు చెప్పారు.

## 5.41 కోట్ల విలువైన బియ్యం స్వాహా

### ముగ్గురు ఇన్‌చార్జిలపై సస్పెన్షన్ వేటు

మెదక్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టడంతో ముగ్గురు ఎంఎల్‌ఎస్ పా యింట్ ఇన్‌చార్జిలను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మెదక్ జిలాల్లోని మెదక్, రామాయంపేట, చేగుంట ఎంఎల్‌ఎస్ పాయింట్లలో వారం రోజుల క్రితం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఇందులో రెండేండ్లుగా జరుగుతున్న అవినీతి వ్యవహారం బయటపడింది. రేషన్ షాపులకు పంపే పీడీఎస్, సన్న బియ్యం సరఫరాలో ఎంఎల్‌ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలు కక్కుర్తి పడుతున్నట్టు తెలిసింది. దీంతో కోట్లు విలువ చేసే పీడీఎస్ బియ్యం, సన్న బియ్యం పక్కదారి పడుతున్నది. సుమారు రూ.5.41 కోట్ల విలువైన పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టగా, మెదక్, రామాయంపేట, చేగుంట ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలను సస్పెండ్ చేశారు.

## ఐకార్‌లో సిరిసిల్ల విద్యార్థినికి 17వ ర్యాంకు

చందుర్తి, సెప్టెంబర్ 30: ఐకార్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్)లో రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యార్థిని సత్తా చాటింది. శనివారం విడుదలైన ఫలితాల్లో చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన రాపెల్లి స్వాతి జాతీయ స్థాయిలో కమ్యూనిటీ సైన్స్ విభాగంలో 17వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్నది.

## డ్రైన్‌లో పడి కానిస్టేబుల్ మృతి

భద్రాచలం, సెప్టెంబర్ 30: కొత్తగూడెం పోలీస్ కంట్రోల్‌రూంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీదేవి(35).. శనివారం భద్రాచలంలో బందోబస్తు సమయంలో భారీ వర్షం కురిసి రోడ్డు జలమయమైం ది. దీంతో డ్రైన్ కనపడక ఆమె అందులో పడి కొట్టుకుపోయింది.


